క్లుప్తంగా

పంటకోత ప్రయోగం



పంటకోత ప్రయోగం చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

డెంకాడ: మండలంలోని డెంకాడ గ్రామంలో రైతు కె.వెంకటసూర్యనారాయణరాజు వరి పంటపొలంలో విజయనగరం ఏరువాక కేంద్రం సమన్వయకర్త కెల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో మార్టేరు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం సిబ్బంది శనివారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. 5 మీటర్ల పొడవు, 5 మీటర్ల వెడల్పు విస్తీర్ణంలో ఈ ప్రయోగం చేయగా 17 కిలోల ధాన్యం దిగుబడి వచ్చినట్లు సదరు సిబ్బంది అంచనా వేశారు. ఈ లెక్కన ఎకరాకి 26 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏవో పూడి నిర్మల, ఏఈవో బి.రామకోటి తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సుబ్రహ్మణ్యస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్య షష్టి పురస్కరించుకుని, స్థానిక కంటోన్మెంట్ గూడ్స్‌షెడ్ వద్ద ఉన్న ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అంగరంగ వైభవంగా నిర్వహించిన స్వామి వారి కల్యాణోత్సవం తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. స్థానిక ఫూల్‌బాగ్‌లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు.

ఎంపీడీవోగా పదోన్నతి



ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్: జిల్లాలోని మెంటాడ మండలంలో ఉన్న ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న సుధాకర్ పట్నాయక్‌కు మెరకముడిదాం ఎంపీడీవోగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు ఆయనకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో ఉత్తర్వులు శనివారం అందజేశారు. చిత్తశుద్ధి, నిబద్ధతతో విధులు నిర్వహించి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య ప్రణాళికా అధికారి బి.వి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

నిషేధిత పాలిథిన్ వాడొద్దు

విజయనగరం: నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ సంచులు వాడొద్దని శానిటరీ ఇన్‌స్పెక్టర్ షాలేమ్ రాజ్ సూచించారు. నగరంలోని 12వ సచివాలయం పరిధిలో ఉన్న లిటిల్ హార్ట్స్ పాఠశాల విద్యార్థులకు పాలిథిన్, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై శనివారం అవగాహన కల్పించారు. ప్రభుత్వాలు నిషేధించిన పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ వాడితే పర్యావరణం కలుషితమై ప్రమాదకరమైన రోగాల బారినపడతామని తెలిపారు. మనం వాడుతున్న పాలిథిన్ సంచులు నేలలో కలిసేందుకు కొన్ని వేల సంవత్సరాలు పడుతుందని, ప్రస్తుతం ప్రపంచంలో విపరీతంగా వాడుతున్న పాలిథిన్, ప్లాస్టిక్‌ల కారణంగా గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు.

నేరాల నియంత్రణకు చర్యలు

లక్కవరపుకోట: నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ప్రధాన జంక్షన్లలో, రోడ్లపై మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నామని విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం తనిఖీలు నిర్వహించారు. పెండింగ్ కేసుల వివరాలను, ఇతర రికార్డులను, ఫిర్యాదుదారులకు అందించే రసీదులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను గుర్తించి ఆర్‌అండ్‌బీ అధికారులతో సమన్వయం చేసుకుని స్పీడ్ బ్రేకర్లు, స్టాపర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. డ్రగ్స్,గంజాయి రవాణా, వినియోగం, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ, సైబర్ నేరాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే అనర్థాలు, సైబర్ మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో, విద్యాలయాల్లో పోలీస్ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఇటీవల బదిలీలు అయిన పోలీస్ సిబ్బందికి త్వరలోనే పూర్తిస్థాయిలో రిలీవ్ చేసి వారు బదిలీ అయిన స్టేషన్‌లలో జాయిన్ అయ్యేలా చూస్తామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ నవీన్‌పడాల్ ఉన్నారు.

- నెలాఖరుతో ముగియనున్న ఆస్తి పన్ను గడువు
- 2025 జనవరి 1తో వడ్డీతో కలిపి చెల్లించాల్సిందే..
- పన్ను వసూలు డిమాండ్ రూ.67.50 కోట్లు
- ఇప్పటివరకు వసూలైనది.. రూ.21.73 కోట్లు
- మొండి బకాయిదారులకు రెడ్ నోటీసుల జారీ

గడువు నెలాఖరు వరకే..



విజయనగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: వడ్డీ భారం లేకుండా విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లించేందుకు సమయం దగ్గర పడుతోంది. ఏడాదిలో మొదటి అర్ధ సంవత్సరం పన్ను మొత్తం చెల్లించేందుకు ఈ నెల 30వ తేదీతో గడువు ముగియనుంది. ఈ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను, రెండో అర్ధ సంవత్సరం పన్ను చెల్లించకపోతే వడ్డీ భారం తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు. పన్ను చెల్లించేందుకు మరో 24 రోజుల గడువు మాత్రమే ఉండడంతో భవన యజమానులను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. గడువు ముగిసిన తర్వాత పన్ను చెల్లించే వారికి రూ.100కి రూ.2 చొప్పున వడ్డీ పడుతుందని, అంతేకాకుండా మొదటి అర్ధ సంవత్సరానికి సంబంధించి, జూన్ నెలాఖరులోగా పన్ను మొత్తం చెల్లించని వారు అదనంగా మరో రూ.2 చొప్పున వడ్డీతో కలిపి మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

బకాయి పన్ను వసూళ్లపై దృష్టి..

గత ఆర్థిక సంవత్సరంలో ఆశించిన స్థాయిలో పన్నుల వసూలు జరిగినప్పటికీ 2023–24 ఆర్థిక సంవత్సరంతో పాటు గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. ఆస్తి, నీటి పన్నులతో పాటు ఖాళీ స్థలాల నుంచి వసూలు కావాల్సిన పన్ను మొత్తం రూ.కోట్లలో బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మొండి బకాయిదారులకు అధికారులు రెడ్ నోటీసులు జారీ చేయడంతో పాటు ప్రత్యేక బృందాలుగా ఏర్పడిన అధికారులు.. మొండి బకాయిదారులపై కచ్చితంగా పన్ను చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారు. బకాయి పన్నులు రాబడితే నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని పలువురు అంటున్నారు.

70 వేలకు పైగా అసెస్‌మెంట్లు..

అధికారిక లెక్కల ప్రకారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 70 వేలకు పైగా అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తంలో పాత, కొత్త బకాయిలు కలిపి రూ.67.50 కోట్లకు పైగా ఆదాయం రావాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు రూ.21.73 కోట్లు వసూలు చేసినట్లు అధికారిక లెక్కల వెల్లడిస్తున్నాయి. ఈ లెక్కన మరో రూ.45.76 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.



బకాయిదారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్న విజయనగరం కార్పొరేషన్ రెవెన్యూ సిబ్బంది(ఫైల్)

రెండు దఫాలు వసూలు..

వాస్తవానికి ఆర్థిక సంవత్సరంలో రెండు దఫాలుగా మున్సిపల్ శాఖ నగరాలు, పట్టణాల పరిధిలోని భవన యజమానుల నుంచి పన్నులు వసూలు చేస్తోంది. మొదటి విడతలో జూన్ నెలాఖరు వరకు పన్ను వసూలు చేస్తారు. రెండో విడతలో డిసెంబరు నెలాఖరులోగా వసూలు చేస్తారు. ఈ విధంగా రెండు విడతల్లో నిర్ణీత సమయానికి పన్ను చెల్లించని వారికి రెండు శాతం వడ్డీ విధిస్తారు. ఈ మేరకు జూన్ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరం పన్ను, డిసెంబరు నెలాఖరులోగా రెండో అర్ధ సంవత్సరం పన్ను కలిపి చెల్లించాల్సి ఉంటుంది.

పన్ను చెల్లించడం బాధ్యత..

పన్ను చెల్లించడాన్ని బాధ్యతగా చూడాలి. నగరాభివృద్ధికి సహకరించాలి. 2024–25 ఆర్థిక సంవత్సరానికి భవనాలు, నీరు, ఖాళీ స్థలాల ద్వారా పన్నుల వసూళ్లకు ప్రజల్లో అవగాహన కల్పించాం. ఈ నెలాఖరులోగా మొదటి అర్ధ సంవత్సరం, రెండో అర్ధ సంవత్సరంలకు సంబంధించిన పన్ను మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. లేని పక్షంలో వడ్డీ భారం తప్పదు. ఈ విషయమై భవన యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నాం.

–పి.నల్లనయ్య, కమిషనర్, విజయనగరం కార్పొరేషన్



హెల్త్ మేల్ అసిస్టెంట్ల తొలగింపు అన్యాయం

- ఏపీ ఎన్జీవో మండల అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు



ఏపీ ఎన్జీవో మండల అధ్యక్షుడు దుర్గారావు

భోగాపురం: జిల్లాలో హెల్త్ మేల్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహిస్తున్న 56 మందిని విధుల నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమని ఏపీ ఎన్జీవో మండల అధ్యక్షుడు కొమ్మూరు దుర్గారావు అన్నారు. ఇదే విషయమై ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ 22 ఏళ్లుగా ఉద్యోగాలు చేస్తున్న వారిని అకస్మాత్తుగా విధుల నుంచి తొలగిస్తే వారు ఎక్కడకని వెళ్తారని, వారి కుటుంబాలు రోడ్డున పడతాయని విచారం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1300 మంది హెల్త్ మేల్ అసిస్టెంట్ల అర్హతలపై కొంతమంది అప్పట్లో కోర్టును ఆశ్రయించడంతో 2013లో వారిని తొలగించడం జరిగిందని గుర్తు చేశారు. అయితే అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో జీవో నంబరు 1207ను విడుదల చేసి, తిరిగి వారిని విధుల్లో చేర్చుకుందని తెలిపారు. ఇటీవల ఆ జీవోను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు రద్దు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆఘమేఘాల మీద వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిందని, ఉత్తర్వులు జారీ అయిన సాయంత్రానికే జిల్లా వైద్యాశాఖ అధికారులు వారిని తొలగిస్తున్నట్లు ప్రకటించారన్నారు. ప్రభుత్వం తక్షణమే వారిని విధుల్లోకి తీసుకుని, వారి కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు



నెల్లిమర్ల మండలంలోని నీలంరాజుపేట గ్రామంలో ప్రభుత్వ భూమి ఆక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించారు. ఆక్రమిత ప్రదేశానికి రెవెన్యూ సిబ్బంది శనివారం వెళ్లి, ఎవరైనా ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టినా, ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా శిక్ష తప్పదని తహసీల్దారు సుదర్శనరావు హెచ్చరించారు.

–నెల్లిమర్ల రూరల్

రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలి



నెల్లిమర్ల మండలం, బూరాడపేటలో 118 గొర్రెలు ఒకేసారి మృతి చెందడం బాధాకరమని, బాధితులకు రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి టీవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆ గ్రామానికి వెళ్లిన ఆయన.. బాధితులను పరామర్శించి, గొర్రెలు మృతి చెందడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి గొర్రెల పెంపకం పైనే ఆధారపడి జీవిస్తున్న వారిని ప్రభుత్వమే మానవతా దృక్పథంతో ఆదుకునేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సీపీఎం మండల నాయకుడు కిల్లంపల్లి రామారావు తదితరులు పాల్గొన్నారు.

–నెల్లిమర్ల రూరల్

'మత్తు'తో జీవితం చిత్తు



మత్తు పదార్థాలతో జీవితం చిత్తు(నాశనం) అవుతుందని, ప్రతిఒక్కరూ గంజాయి, మద్యం, ఖైనీ, గుట్కా, సిగరెట్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రవికుమార్ సూచించారు. భోగాపురం మండలంలోని ముంజేరు గ్రామంలో మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి యువత, విద్యార్థులు ఎక్కువగా చెడు అలవాట్లకు బానిసలై, తమ భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిఒక్కరూ మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆదర్శవంతమైన జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎన్.సురేష్, సిబ్బంది సన్యాసిరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

–భోగాపురం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి శనివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులు దళారుల బారినపడి మోసపోవద్దని తెలిపారు. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని, చివరి గింజ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. మిల్లులకు ధాన్యం తరలించిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు తాడ్డి గోవింద, రామంజనేయ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సీఈవో ప్రభాకర్, సర్పంచ్ మామిడి అప్పయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు విద్యే ఆధారం

- కలెక్టర్ అంబేడ్కర్



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం రూరల్: ప్రతీ విద్యార్థి ఉజ్వలమైన భవిష్యత్తు పొందాలంటే విద్య ఒక్కటే సక్రమమైన రాజమార్గమని లెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ అన్నారు. మండలంలోని మలిచెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా పాఠశాల ఆవరణ అంతా కలియతిరిగి విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులను పరిశీలన చేశారు. అనంతరం స్థానిక పెద్దలతో పాఠశాల వాతావరణం, గ్రామాభివృద్ధిపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1796 పాఠశాలల్లో నేడు షెడ్యూల్ ప్రకారం ఒకే రోజు మెగా పేరెంట్స్ డే వేడుకలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థుల స్థితిగతులు, ప్రతీ ఒక్క తల్లిదండ్రికి పూర్తిగా తెలియజేయాలనే సంకల్పంతో ఇంతటి బృహత్తర కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థుల సమగ్ర నివేదికలో చదువు, ఆరోగ్యం, క్రీడలపై ఆశక్తి, తదితర అంశాలకు చెందిన విషయాలను ప్రతీ తల్లిదండ్రికి చెప్పడానికి ఈ కార్యక్రమం రూపొందించడం జరిగిందన్నారు. ప్రతీ తల్లిదండ్రి తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే వేయాలని హితవు పలికారు. అనంతరం చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన తిలకించారు. పాఠశాల ప్రోగ్రెస్‌కు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముచ్చటించారు. అనంతరం విద్యార్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. పాఠశాల హెచ్‌ఎం జి.సుజాత, స్థానిక సర్పంచ్ తుమ్మగింటి రమాకుమారి, ఎంఈఓ రాజు, గ్రామ పెద్దలు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

పాలీ టెక్ ఫెస్ట్‌లో భాగంగా విజయనగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని 3 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 14 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, తాము రూపొందించిన 75 ప్రాజెక్టులను శనివారం ప్రదర్శించారు. ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా సాగాల్సిన జీవన విధానానికి అవసరమైన ఈ ప్రాజెక్టుల రూపకల్పనలో విద్యార్థుల ఆలోచన, కనబరిచిన సృజనాత్మకత చూపరులను ఆలోచింపజేస్తోంది. ప్రాజెక్టుల పనితీరును వివరిస్తున్న విద్యార్థుల వివరాలిలా..

–విజయనగరం అర్బన్



స్మార్ట్ కమ్యూనికేషన్..

మూగ, చెవిటి వారి కోసం పరిశోధించి, తయారు చేసిన పరికరం ఇది. మోచేతికి తగిలించుకోవాలి. వీడియో కాల్స్, వాయిస్ కాల్స్, చాట్ అప్లికేషన్స్, లైవ్ స్ట్రీమింగ్ వంటి రియల్ టైమ్ కమ్యూనికేషన్స్ అందిస్తుంది. త్వరితగతిన స్పందన, రియల్ టైమ్ ఇంటరాక్షన్, సమాయం, శ్రమ ఆదా చేస్తుంది. అయితే డేటా ప్రైవసీ, భద్రత, అధిక బ్యాండ్ విడ్త్ అవసరం వంటి అంశాలను చాలెంజ్‌గా తీసుకోవాల్సి ఉంటుంది.

–ఎంఆర్‌ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం

సుస్థిర విద్యుత్ ఉత్పత్తి..

ప్రకృతి నుంచి లభించే పునరుద్ధరణీయ వనరులను వినియోగిస్తూ గాలిమిల్లు విద్యుత్ కేంద్రం ద్వారా సుస్థిర విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టు ఇది. పవన(గాలి) శక్తి నుంచి విద్యుత్ తయారు చేసేందుకు ఉపయోగపడుతుంది. ఇది పర్యావరణ హితమైనది.. సుస్థిరమైనది.

–ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, విజయనగరం





వ్యర్థాల నుంచి విద్యుత్..

గృహ సముదాయం, కాలనీల నుంచి వెలుడే వ్యర్థాలు, వాడుక నీరు వంటి వాటితో విద్యుత్‌ను తయారు చేసే ప్రాజెక్టు ఇది.

–స్వామీ వివేకానంద పాలిటెక్నిక్ కళాశాల, కలువరాయి, బొబ్బిలి

డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం



అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

విజయనగరం క్రైమ్: డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దామని వన్‌టౌన్ సీఐ ఎస్.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక తోటపాలెం చైతన్య కళాశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాలు–వాటి దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యపానం, ధూమపానం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి అలవాటు పడితే బంగారు జీవితం నాశనమైపోతుందని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారు వాటి బారి నుంచి ఎలా తప్పించుకోవాలన్న దానిని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ఆవరణలో డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేసి, విద్యార్థుల్లో ఎవరైనా మత్తు పదార్థాలు తీసుకుంటున్నట్లు తెలిస్తే డ్రాప్‌బాక్స్ ద్వారా సమాచారం ఇవ్వాలన్నారు.